

పాడి రైతులను ప్రోత్సహించాలి
జిల్లాలోని మహిళా పాడి రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. - 8లో



పరిశ్రమలు పెట్టొద్దని ఆందోళన
దళితుల భూముల్లో పరిశ్రమలు పెట్టొద్దని స్థానిక దళితులు ఆందోళన వ్యక్తం చేసి కలెక్టర్‌కు విన్నవించారు. - 8లో



గజరాజుల బీభత్సం
కల్లూరు, పాతపేట, జూపల్లిలోని పంట పొలాల్లో గజరాజులు బీభత్సం సృష్టించి ఆస్తి నష్టం కలిగించాయి. - 8లో

న్యూస్‌రీల్

బిల్డింగ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన అభ్యర్థులు స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సుకు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా భివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో కోర్సు నిర్వహిస్తున్నారన్నారు. కోర్సు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో స్పోర్ట్స్ కోటాలో పని చేసే క్రీడాకారుల నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచుకునేందుకు ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఎటువంటి ప్రామాణిక, దీర్ఘకాలిక సెలవు అవసరం లేకుండా కోర్సును రెండు సంవత్సరాల వ్యవధి లోపు పూర్తి చేయవచ్చన్నారు. క్రీడాకారుల ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉద్యోగాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా కోర్సు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు 9599303866 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

15 నుంచి గాలికుంటు నివారణ టీకాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా లు వేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి ఆరీఫ్ తెలిపారు. ఈనెల 15 నుంచి పశువులకు టీకాలు వేస్తున్నామన్నారు. జిల్లాకు 4.52 లక్షల డోసేల వ్యాక్సినేషన్ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరో రెండు బార్లకు లైసెన్సులు



లక్కీడిప్ తీస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్ : జిల్లాలో మద్యం బార్ల నిర్వహణ కోసం రెండో విడత జారీ చేసిన నోటిఫికేషన్‌లో రెండు బార్లను నిర్వాహకులు దక్కించుకున్నారు. చిత్తూరు నగరంలో 5, పలమనేరులో ఒక బార్ ఏర్పాటు చేయడానికి ఈనెల 3న అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. చిత్తూరు నగరంలో ఒకటి, పలమనేరులో ఓ బార్ కోసం బుధవారం ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. వీటిని గురువారం చిత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ లాటరీ తీసి, లైసెన్సులు ఎవరికి దక్కాయో ప్రకటించారు. మూడేళ్ల కాలపరిమితి ఉండేలా లైసెన్సులు జారీ చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కాగా చిత్తూరులో ఎస్‌పీఎస్, పలమనేరులో రాజలక్ష్మి అనే ఇద్దరు బార్ లైసెన్సులను దక్కించుకున్నారు.

ఆడిట్ నివేదికలు పంపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇళ్ల పట్టాల మంజూరుకు సేకరించిన భూ వివరాలకు సంబంధించిన ఆడిట్ సమాధానాల నివేదికలు వెంటనే పంపాలని తహసీల్దార్లను డీఆర్‌వో మోహన్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లతో మాట్లాడారు. పుంగనూరులో సర్వే నంబర్ 335/2లో ఇళ్ల పట్టాలకు సేకరించిన భూమిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించారనే అంశంపై వివరణ ఇవ్వాలన్నారు. అదే విధంగా పుంగనూరులో ఇళ్ల పట్టాలకు 363 మందికి ఒక సెంట్ భూమికి బదులు 1.5 సెంట్ల భూమి, 452 మందికి 8.22 ఎకరాల భూమి సేకరించగా కేవలం 246 మందికి మాత్రమే పంపిణీ చేశారనే అభియోగాలపై విచారణ చేయాలన్నారు. చిత్తూరు నగర పరిధిలోని అనుపల్లి, బండపల్లి, దొడ్డిపల్లి ప్రాంతాల్లో భూ సేకరణ ఎక్కువ చేశారనే ఫిర్యాదులున్నాయన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్ల భూమి పంపిణీ చేయాల్సి ఉండగా, ఇష్టానుసారం పంపిణీ చేశారన్నారు. ఇందుకు గల కారణాలను తహసీల్దార్ల నుంచి ఆర్‌డీవోలు సేకరించి నివేదికలను కలెక్టరేట్‌కు పంపాలని డీఆర్‌వో ఆదేశించారు.

నేడు జిల్లా జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక శుక్రవారం సదుం మండల కేంద్రంలోని పోలీస్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు మమత, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. 2006 డిసెంబర్ 31 తర్వాత జన్మించిన వారే పాల్గొనడానికి అర్హులని, బాలురు 75 కేజీలలోపు, బాలికలు 65 కేజీలలోపు బరువు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల జాబితాతో పాటు ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. ఎంపికైన వారు 25 నుంచి 28వ తేదీ వరకు విజయవాడలోని గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9440345455 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కలుషితం..కలవరం

గ్రౌండ్ రిపోర్ట్

జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మరోవైపు తాగునీటి కలుషితంతో వివిధ ప్రాంతాల్లో ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారు. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతోంది. ఫలితంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. రెండు నెలలకు ఒక్కసారి కూడా ట్యాంక్‌లను శుభ్రం చేయడం లేదు. కాలువల్లో పైపు లైన్లు, గేట్‌వాల్వ్‌లు ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీరు విషతుల్యం అవుతోంది. సీజన్‌లో అప్రమత్తం కావాల్సిన అధికారులు మొక్కుబడి చర్యలతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నారు. కనీసం పర్యవేక్షణ చర్యలు కూడా తూతూమంత్రంగా చేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- పర్యవేక్షణ లోపంతో తాగునీరు కలుషితం
- ట్యాంకుల శుభ్రత దేవుడెరుగు
- కాలువల్లో తాగునీటి పైపులు
- పట్టణాలు, నగరాల్లో కలుషిత నీటి సరఫరా
- పైప్‌లైన్ లీకేజీలతో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- అటకెక్కిన నీటి పరీక్షలు
- ముందస్తు చర్యలు పట్టని అధికారులు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా వ్యాప్తంగా రెండు వారాలుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇంటింటికీ పంపిణీ చేసే తాగునీటి సరఫరాలో అనేక లోపాలున్నాయి. పైపులైన్ లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతోంది. ప్రజలు అదే నీటిని తాగుతుండటంతో జబ్బుల బారిన పడుతున్నారు. పట్టణాలు, చిత్తూరు నగరంలో అడుగడుగునా పైపులైన్ లీకేజీలే దర్శనమిస్తున్నాయి. నీటిని శుద్ధి చేయడానికి ప్రత్యేక యంత్రాంగం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ట్యాంకులను శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటివి మొక్కుబడిగా చేస్తున్నారు. కొన్ని మండలాల్లో నెలలు గడుస్తున్నా ట్యాంకులు శుభ్రం చేయడం లేదు.

నెలల తరబడి అవే సమస్యలు

పల్లెలు, పట్టణాలు, నగరాలు తేడా లేకుండా కలుషిత తాగునీరే సరఫరా అవుతోంది. పైపులైన్ లీకేజీలు, గేట్ వాల్వ్‌ల వద్ద గుంతలతో నీటి వనరులు మురికిగా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాల సమయంలో మురుగు నీటి సరఫరా ఎక్కువగా ఉంటోంది. నెలలు, సంవత్సరాలు అవుతున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కొన్ని వారాలుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అనేక ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతోంది.

మొక్కుబడిగా నీటి నాణ్యతా పరీక్షలు

జిల్లాలోని 696 పంచాయతీలకు కాలం చెల్లిన కిట్లు సరఫరా చేయడంతో ఫలితం అంతగా కనబడటం లేదు. నీటి పరీక్షల పరంగా ఆర్‌డబ్ల్యూఎస్ , పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, వైద్యశాఖల మధ్య సమన్వయం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరంగా పంచాయతీకి ఒక టెస్టింగ్ కిట్ అందజేశారు. వీటి ద్వారా తక్షణం వంద పరీక్షలు చేయవచ్చు. అక్కడ సమస్య ఉందని తెలిస్తే ల్యాబ్‌కు పంపి పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు. సమస్య ఉంటే క్లోరినేషన్ పనులు చేస్తున్నారు. గుడిపాల, పలమనేరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు, నగరి ప్రాంతాల్లో అపరిశుభ్ర నీటిని తాగి ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. తరచూ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు నీటి పరీక్షలు చేయడం లేదు. అసలే కిట్లు కనిపించడం లేదు. జిల్లాలో చిత్తూరు, కార్వేటినగరం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ పరంగా నీటి పరీక్షల ల్యాబ్‌లు ఉన్నాయి. జిల్లా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఏర్పాటు చేసిన నీటి నాణ్యత విభాగం తనిఖీలు తూతూ మంత్రంగా చేస్తున్నట్లు తెలుస్తోంది.

మూలకు చేరిన నీటి పథకాలు

పంచాయతీ పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతి సమావేశం చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో వీటిపై పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అనేక చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. అనేక గ్రామాల్లో పంపింగ్ స్కీములు కూడా మూలన పడ్డాయి. కొన్ని ప్రాంతాకు మంచి నీరు నేటికి సరఫరా అందే పరిస్థితి లేదు. కిట్లతో నీటి నాణ్యత పరిశీలించి ప్రజలకు తాగేందుకు సరఫరా చేయాలి. నీటిలో ఫ్లోరిన్, కలుషితం, పీహెచ్ ఏమోతాదులో ఉందనే అంశాలను నీటి కిట్‌లతో తెలుసుకోవచ్చు. కానీ ఈ పరీక్షలు అంతంత మాత్రంగానే సాగుతున్నట్లు తెలుస్తోంది.

కలుషిత నీటితో దుష్ప్రభావాలు ఇలా..

- నివాస గృహాల నుంచి వెలువడే మురుగు నీరు, జంతువుల మలమూత్ర విసర్జితాల నుంచి నీటిలోకి చేరి బ్యాక్టీరియా, సూక్ష్మజీవులను వ్యాధి కారకాలుగా గుర్తిస్తారు. ఇవి జీర్ణాశయ పేగు సంబంధమైన వ్యాధులకు దారితీస్తాయి.
- కలుషిత నీటిని తాగడంతో కలరా, డయేరియా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు మొదలైన వ్యాధులు వ్యాపిస్తాయి.
- మెర్క్యూరీ సమ్మేళనాలతో కలుషిత నీటిని తాగడంతో మినిమేటా అనే వ్యాధి సంభవిస్తుంది. ఈ వ్యాధి వచ్చిన వారికి అవయవాలు సరిగ్గా పనిచేయకపోవడం, వినికిడి, దృష్టి లోపాలు, మాట పడిపోవడం , జన్యుపరమైన మార్పులు చోటు చేసుకుంటాయి.
- ఆర్సెనిక్ అనే భార లోహంతో కలుషిత నీటిని తాగడంతో మూత్రాశయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం వంటి అవయవాలకు సంబంధించిన క్యాన్సర్ వ్యాప్తి చెందుతాయి.
- నీటిలో కాడ్మియం శాతం ప్రమాదకర స్థాయిని దాటితే ఎముకల సాంద్రతను తగ్గిస్తుంది. నీటిలో చేరిన సీసం కారణంగా మూర్ఛ వ్యాధి, అధిక రక్తపోటు, కీళ్ల నొప్పులు, జ్ఞాపకశక్తి లోపించడం జరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

ట్యాంకుల శుభ్రత ఉండాల్సి ఇలా..

నీటి ట్యాంకులను నెలకు రెండుసార్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలలో నెలకు ఒకసారైనా పరిశుభ్రం చేయాలి. ఎప్పుడు శుభ్రం చేసింది తర్వాత శుభ్రం చేసే తేదీలను విధిగా ట్యాంకుల వద్ద నమోదు చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో వాటిని విస్మరించారు.

- రోజూ క్లోరినేషన్ చేయాలి. క్లోరినేషన్ మోతాదు తాగునీరు పైపులైల్ స్టార్టింగ్ పాయింట్ వద్ద ఎంత ఉందో ఇంచుమించు చివరి పాయింట్ వద్ద అంతే ఉండే విధంగా చూసుకోవాలి. గ్రామాలు, నగరాల్లో అసలు క్లోరినేషన్ జోలికే వెల్లడం లేదు.
- ప్రతి రక్షిత తాగునీటి పథకం వద్ద రిజిస్టర్లు ఏర్పాటు చేసి ఎంత పరిమాణం తాగునీటి సరఫరా చేసింది. బ్లీచింగ్ పౌడి ఎంత కలిపారో నమోదు చేయాలి. అసలు రిజిస్టర్లే చాలా ప్రాంతాల్లో అమలు చేయడం లేదు.
- ఓవర్‌హెడ్ ట్యాంకుల పైన మూత మూసి ఉంచాలి. ఈ–కోలి బ్యాక్టీరియా వంటి ప్రమాదకర సూక్ష్మ జీవులు లేకుండా పరీక్షలు నిర్వహించాలి. నాచు, పాచి పట్టకుండా శుభ్రంగా ఉంచాలి. ఈ పనులు జిల్లాలో 80 శాతం జరగడం లేదు.
- తాగునీటి పైపులైన్లు లీకులు లేకుండా చూడటం, కొళాయిలు చుట్టూ దిమ్మెలు నిర్మించాలి. లీకేజీలను అరికట్టడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

గుర్తించిన సమస్యలు ఇలా...

- జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పైకప్పు లేని గుంతలు, కాలువలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో నీటి కాలుష్యం సమస్యలు ఏర్పడుతున్నాయి.
- చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో లీకేజీ సమస్యలు ఉండటంతో మురుగు నీరు పైపులైన్‌లలోకి చేరి తాగునీరు కలుషితం అవుతోంది. ఇలాంటి లీకేజీలు 100కు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది.
- జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో వాగులు, కాలువల నుంచి నేరుగా మోటార్ల సాయంతో నీటిని పంపింగ్ చేస్తున్నారు. దీంతో తాగునీరు కలు షితం అవుతోంది.
- ఓవర్‌హెడ్ ట్యాంకులను సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో తాగునీరు కలుషితం అవుతోంది. చాలా ట్యాంకులలో పాచి పేరుకుపోయింది. అధికారులు అలసత్వం వహిస్తున్నారు.




చిత్తూరులోని ల్యాబ్‌లో నీటి పరీక్షలు



నింద్ర ధర్మరాజ గుడి వద్ద పైపులు బిగించని ట్యాంకు

పరిశుభ్రత అంతంతే..



నగరి పీసీఎన్ జడ్పీహెచ్ఎస్ మైదానంలో నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

నగరి : నగరిలో తాగునీటి సరఫరాకు 18 ట్యాంకులు ఉండగా వాటిలో 11 మరమ్మతులకు గురయ్యాయి. 7 ట్యాంకులు మాత్రమే వినియోగిస్తున్నారు. వినియోగించే ట్యాంకుటను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచి క్లోరినేషన్ చేస్తున్నారు. ట్యాంకులు వినియోగంలో లేని ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తరచూ మోటార్లు రిపేరు అవుతుండటం, జాతీయ రహదారి పనుల్లో భాగంగా పైపులు పగలడం కారణాలతో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాలో సమస్యలున్నాయి. నగరి మున్సిపాలిటీలో రెండు నెలలక్రితం వాటర్ టెస్టింగ్ చేశారు. ప్రస్తుతం శాంపిల్స్ పంపారు. ఇంకా రిపోర్టు రాలేదు.

- నింద్ర మండలంలో 40 ట్యాంకులు ఉండగా వాటిలో 15 మరమ్మతులకు గురయ్యాయి. వాటిని శుభ్ర పరచడం లేదు. ట్యాంకులున్న ప్రాంతాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నింద్ర ధర్మరాజ గుడి వద్ద గల ట్యాంకు నిర్మాణం పూర్తయి 4 ఏళ్లు అవుతున్నా ఇంకా పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వలేదు.
- విజయపురం మండలంలో 32 ట్యాంకులు ఉండగా వాటిలో 11 మరమ్మతులకు గురయ్యాయి. వాటిని శుభ్ర పరచడం లేదు. వినియోగంలో ఉన్న ట్యాంకులు నెలకు ఒకసారి క్లోరినేషన్ చేస్తున్నారు.

ఏడాదికి రెండుసార్లే ట్యాంకుల శుభ్రత

బంగారుపాళెం : మండలంలో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత అంతంత మాత్రంగానే ఉంది. ట్యాంకుల పరిశుభ్రతపై పెద్దగా దృష్టి సారించలేదు. నిబంధనల ప్రకారం 15 రోజులకు ఒక్కసారి తాగునీటి ట్యాంకులు బ్లీచింగ్‌తో శుభ్రం చేసి , క్లోరినేషన్ చేసిన నీరు సరఫరా చేయాల్సి ఉంది. అంతే కాకుండా తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటి వరకు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించిన దాఖలాలు లేవు. నీటి నాణ్యత పరీక్షలకు గత ప్రభుత్వంలో అందించిన కిట్లు ఏమయ్యాయో తెలియడంలేదు. సంవత్సరానికి రెండు , మూడు సార్లు తప్ప ట్యాంకులు శుభ్రం చేయరని ప్రజలు చెబుతున్నారు. మండలంలో 41 గ్రామ పంచాయతీల పరిధిలో 180 గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 200 ట్యాంకులపైగా ఉన్నాయి.



బంగారు పాళెంలో శుభ్రం చేయని తాగునీటి ట్యాంకు

పాచిపట్టిన ట్యాంకులు



పాలసముద్రం : మండలంలో తాగునీటి ట్యాంకు ను క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా ఏ ఒక్క గ్రామాల్లో అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఏదో మొక్కుబడి గా ట్యాంకుల్లో బ్లీచింగ్ కలిపి తాగునీటిని సరఫరా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులకు సరిగా శుభ్రం చేయకపోవడంతో పాచి పెరిగి కలుషిత నీరు సరఫరా అవుతోందని చెబుతున్నారు. పాలసముద్రం మండలంలో రక్షిత నీటి పథకం నిర్వహణ పంచాయతీ , ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పటించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై ఎంపీడీఓ సతీష్‌ను వివరణ కోరగా ఆరు రోజులకొకసారి తప్పకుండా క్లోరినేషన్ బ్లీచింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. క్లోరినేషన్ సక్రమంగా చేపట్టకపోతే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని పంచాయతీలు	696
మొత్తం చేతిబోర్లు	8,329
బోరు బావులు	6,734,
ఓహెచ్ఆర్ ట్యాంకులు	2,886
ఓఎస్ఎల్ఆర్ ట్యాంకులు	699

జాడలేని నీటి నాణ్యత పరీక్షలు



కార్వేటినగరంలో ల్యాబ్‌లో నీటి పరీక్షలు

నీటిలో నాణ్యత ఎంత అనేది ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం నేపథ్యంలో విధిగా తాగునీటి పరీక్షలు పెంచాల్సి ఉండగా అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా పైప్‌లైన్ లీకేజీలు ప్రజలను కలవరపెడుతున్నాయి. జలశయాలు, ట్యాంకుల వద్ద నమూనాలు సేకరించి పరీక్షలు విధిగా చేయాలి. నాణ్యత లోపించినట్లు నిర్ధారణ అయితే వెంటనే చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామాల్లో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొళాయిలను గాలికి వదిలేస్తున్నారు. నీటి నాణ్యత, పర్యవేక్షణ విషయాన్ని అధికారులు పూర్తిగా మరిచిపోయారు. ట్యాంకులు, మురికివాడల నుంచి సరఫరా అయ్యే నీటికి నాణ్యత పరీక్షలు చేయడం లేదు. ముఖ్యంగా పాఠశాలలు కొళాయిల్లో నీటిని పరీక్షించాలనే బాధ్యతను అధికారుల విస్మరించారు.

ఏడాదికి ఒక్కసారే ట్యాంకు శుభ్రం



ఏడాదికి ఒక్కసారే తాగునీటి ట్యాంకు క్లోరినేషన్, బ్లీచింగ్ చేస్తున్నారు. మరుగు నీరు కాలువలు కూడా శుభ్రం చేయకపోవడంతో దోమలు తాకిడి అధికమైంది. కంటి నిండా నిద్ర ఉండడం లేదు.

– ఆనట్స్‌రాజ్, ఆముదాల దళితవాడ, పాలసముద్రం మండలం

రోగాల బారిన పడుతున్నాం



చాలా రోజులుగా తాగునీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో అందులో వస్తున్న నీటిని తాగడంతో రోగాలు వస్తున్నాయి. వారానికి ఒకసారి తాగునీటి ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్, బ్లీచింగ్ పౌడర్లు వేయాలి.

– ధనపాల్, ఆముదాల , పాలసముద్రం మండలం

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకుల బృందం



స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం

వడమాలపేట (పుత్తూరు) : అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో రెండవ రోజైన గురువారం స్వామి వారికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టు, ఉత్సవర్లకు, పద్మావతీ, ఆండాళ్ అమ్మవారు, జయ విజయులు, గరుడాళ్వార్, ఆంజనేయస్వామికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు :

పవిత్రోత్సవాల్లో మూడవ రోజు శుక్రవారం ఉదయం 9–30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. 11–30 గంటల నుంచి 12–30 గంటల మధ్య స్వామి అమ్మవార్లకు మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహించనున్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష

ఐరాల : మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం శ్రేయస్సుగా ఉంటుందని , కుటుంబం శ్రేయస్సుగా ఉంటే సమాజం శక్తివంతమవుతుందని, అందుకే మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి రెడ్డెప్ప ఆధ్వర్యంలో స్వస్థ నారీ– స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రత్యేక వైద్య శిబిరాలు అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడం, కుటుంబ సుభిక్షానికి పునాది వేయడం కార్యక్రమం లక్ష్యమని వివరించారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు రక్తహీనత సమస్యలపై పరీక్షలు, సలహాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, గర్భధారణ జాగ్రత్తలు, తల్లీ బిడ్డ ఆరోగ్యానికి వైద్య సూచనలు, ప్రసూతి అనంతరం సంరక్షణ, తదితర వ్యాధులపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం స్పెషలిస్ట్ డాక్టర్లు మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ప్రవీణ, వైద్యాధికారి రెడ్డెప్ప , స్పెషలిస్ట్ డాక్టర్లు ఉషా, సంధ్య, శ్రీవాణి, అర్పిత, వెంకట్‌రావు, మునికుమార్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జంగాలపల్లెలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుధారాణి

ఆకస్మిక తనిఖీ

కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని జంగాలపల్లెలో నిర్వహిస్తున్న స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ సుధారాణి తనిఖీ చేశారు. మహిళలకు అందుతున్న వైద్య సేవలపై పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసింధూరని అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది చొరవ చూపాలని ఆదేశించారు. ప్రత్యేక వైద్య శిబిరంలో 640 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జిల్లా ఎస్‌హెచ్‌ఎం కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతదేహం లభ్యం

గుడిపాల : మండలంలోని బొమ్మసముద్రం దళితవాడకు చెందిన రాజేష్ (48) మృతదేహం ఎట్టకేలకు లభ్యమైందని గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ద్విచక్ర వాహనంలో వెళ్తూ బావిలో అదుపు తప్పి బోల్తా పడ్డాడు. అయన మృతదేహం లభ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసలు గాలింపు చర్యలు చేపట్టారు. బావిలో నీటిని తోడి గురువారం మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం

చౌడేపల్లె : పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కాటిపేరికి చెందిన హరీష్ భార్య త్రివేణి (22) కడుపునొప్పిని భరించలేక ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు పుంగనూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి తల్లి నీలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి

చౌడేపల్లె : స్నానం చేసేందుకు కరెంటు హీటర్‌ను నీటిలో పెట్టి స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతంతో కె.గోపాల్(73) మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అమరకృష్ణాపురానికి చెందిన గోపాల్ ఇంట్లో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబీకులు గమనించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్న ప్రసాద కేంద్రంలో టీటీడీ ఈవో తనిఖీలు

తిరుమల: టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం సాయంత్రం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడి దర్శన సమయాలు, టోకెన్ విధానం, క్యూలో సౌకర్యాలు, అన్నప్రసాదం రుచి, తిరుమలలో వివిధ పాయింట్ల వద్ద అన్న ప్రసాదాల పంపిణీ తదితర అంశాలపై సమాచారం సేకరించారు. వంటశాల, స్టోర్ రూమ్, జీడి పప్పు బాక్స్‌లను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అన్న ప్రసాద కేంద్ర సిబ్బంది, శ్రీవారి సేవకులతో కూడా మాట్లాడారు. అన్నప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర, స్పెషల్ కేటరింగ్ అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

కలానికి సంకెళ్లు అప్రజాస్వామికం



ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల గొంతుకను వినిపించే పత్రికపై కక్షపూరిత చర్యలు అప్రజాస్వామికం. పత్రికలపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించడం కలానికి సంకెళ్లు వేయడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు ఉన్న మీడియాపై కేసులు పెట్టడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లుతుంది. సాక్షి ఎడిటర్‌తో పాటు సాక్షి జర్నలిస్టులపై నమోదుచేసిన కేసులను ఉపసంహరించుకోవాలి. పత్రికల్లో వచ్చిన వార్తలపై అభ్యంతరకరంగా ఉంటే వివరణ కోరాలే తప్ప అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయం.

– ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి.



మీడియా స్వేచ్ఛకు ముప్పు

మీడియాపై అక్రమ కేసులు పెట్టడం అంటే పత్రికా స్వేచ్ఛను హరించినట్టే. ప్రభుత్వం చేసే తప్పులు ఎత్తి చూపుతూ ప్రజా సమస్యలను పత్రికల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న పాత్రికేయులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే కేసులు పెట్టడం అన్యాయం. ఉన్నది ఉన్నట్టుగా వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టి కక్ష సాధించాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ప్రజలకు, పాలకులకు వారధులుగా, సమాజంలోని సమస్యలను వెలుగెత్తి చాటే విలేకర్లపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తేయాలి. పత్రిక గొంతు నొక్కినంత మాత్రాన నిజం నిజం కాకుండా పోతుందా ? నచ్చని అంశాలు ప్రచురితమైతే ఖండన ఇవ్వాలి. అంతే తప్ప పనిగట్టుకుని కేసులు పెట్టడం అన్యాయం.

– సద్దాం, స్టూడెంట్స్ జేఏసీ చిత్తూరు జిల్లా చైర్మన్



'స్వస్థ్ నారీ'వెతలు

- జిల్లాలో ప్రారంభమైన స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్
- 15 రోజుల పాటు మహిళలకు వైద్య పరీక్షలు
- మొక్కుబడిగా కార్యక్రమ నిర్వహణ



రామాపురం క్యాంపులో మహిళలు లేక ఖాళీగా దర్శమిస్తున్న కుర్చీలు



తవణంపల్లిలోని క్యాంపులో అరకొరగా ఇలా..

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్‌కు నిధుల కొరత వేధిస్తోంది. ప్రారంభంలోనే అభియాన్ అష్టకష్టాలు పడుతోంది. నిర్వహణకు ముందస్తు వ్యయం లేక కార్యక్రమం నీరసించిపోతోంది. క్షేత్రస్థాయిలోని అధికార పార్టీ నాయకులను ఆశ్రయిస్తే చేతులెత్తేస్తున్నారు. ఆ ఖర్చులు తాము భరించలేమంటూ సిబ్బంది సైతం వెనకడుగు వేస్తున్నారు. ఖర్చు పెడితే తర్వాత బిల్లులు ఇస్తామని జిల్లా అధికారులు ఖర్చు మాటను దాట వేస్తున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.

మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ పేరిట ప్రత్యేక కార్యక్రమం తలపెట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, అవసరమైన చికిత్సలు, వైద్య పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక , పట్టణ, సామాజిక , ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, వైద్య కళాశాల ఆసుపత్రులు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులు సహకారంతో మహిళలు, పిల్లల

రెండు రోజుల పాటు క్యాంపు వివరాలు

ఆస్పత్రి	క్యాంపుల సంఖ్య
జిల్లా ఆస్పత్రి	1
సీహెచ్‌సీ	6
పీహెచ్‌సీ	7
విలేజ్ హెల్త్ క్లినిక్	77

కేంద్రీకృత ఆరోగ్య శిబిరాలు నిర్వహణ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

538 శిబిరాలు

జిల్లా వ్యాప్తంగా 538 శిబిరాలు చేపట్టేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్యాంపులను 50 పీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు, 437 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు , 5 సీహెచ్‌సీలు, 3 ఏరియా ఆస్పత్రులు, 2 స్పెషలిస్ట్ క్యాంపులు నిర్వహించేలా ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే క్యాంపు నిర్వహణ క్షేత్ర స్థాయిలో కష్టతరంగా మారింది.

ఓపీ వివరాలు

ఓపీరకం	సంఖ్య
సాధారణ ఓపీ	10193
ఏఎన్‌సీ	1133
ఎంసీపీ కార్డు మంజూరు	106

శిబిరం నిర్వహణలో గందరగోళం

ముందస్తు ప్రణాళికల ప్రకారం క్యాంపులు నిర్వహిస్తున్నారు. అయితే క్యాంపు నిర్వహణ ఏర్పాట్లకు ముందస్తు వ్యయం చేసే వారు లేక క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు సైతం పలు చోట్ల చేతులెత్తేస్తున్నారు. ఖర్చు చేయాలంటే వెనకడుగు వేస్తున్నారు. షామియానా, కుర్చీలు, టేబుళ్లు, మధ్యాహ్నం భోజనం, టీ, కాఫీ, బిస్కెట్స్....ఇలా ఒక్కో క్యాంపునకు రూ. 10 వేల నుంచి రూ. 20వేల వరకు ఖర్చు అవుతోంది. దీంతో చాలా మంది మా వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలోని సిబ్బందిపై భారం మోపుతున్నారు. ముందు ఖర్చు పెడితే..తర్వాత బిల్లులు వస్తాయని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వైద్య సిబ్బంది అంతా డబ్బులు ఎక్కడి నుంచి పెట్టాలని వాపోతున్నారు.

ప్రజల్లో కొరవడిన అవగాహన

మహిళా ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల్లో అవగాహన కొరవడుతోంది. ముఖ్యంగా మహిళలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించడం లేదు. పలు చోట్ల నిర్వహణపై మహిళలకు సమాచారం లేదు. దీంతో క్యాంపులో మహిళలు రాక శిబిరం వెలవెల బోతోంది. కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మహిళల కంటే వైద్య సిబ్బందే అధికంగా కనిపిస్తున్నారు. క్యాంపు లక్ష్యం అధిగమించలేకపోతున్నారు. పలుచోట్ల బలవంతంగా మహిళలను శిబిరాలకు లాక్కొస్తున్నారు. మహిళలు క్యాంపునకు వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు కొన్ని రకాల మందులు, మాత్రలు మాత్రమే ఉన్నాయని, చాలా వరకు లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణకు ముందుగానే మండల ప్రజా పరిషత్‌కు నిధులు కేటాయించి, ఇబ్బందులు లేకుండా క్యాంపులు జరిపించామనే విషయాన్ని వైద్య బృందం గుర్తు చేస్తోంది.

దళితుల భూముల్లో పరిశ్రమలు పెట్టొద్దని ఆందోళన

శ్రీరంగరాజపురం : పరిశ్రమల ఏర్పాటుకు కలెక్టర్ సుమిత్‌కుమార్, రాష్ట్ర ఏపీఐఐసీ ప్రతినిధి సుబ్బారావుతో కలిసి మండలంలోని 56–కనికాపురం పాత పాళ్యం, జీఎంఆర్‌పురం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ, డీకేటీ, ప్రైవేటు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు మండలంలోని పరిశ్రమలు ఏర్పాటుకు 1000 ఎకరాల భూమి అవసరం ఉందన్నారు.

మా భూముల్లో పరిశ్రమలు పెట్టొద్దు : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పాతపాళ్యం దళితులకు, జీ.ఎం.ఆర్.పురం ఎస్టీలకు భూమి లేని పేదలకు డీకేటీ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల పేరుతో దళితుల భూములను లాక్కోవాలని చూస్తోందని వాపోయారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం చేస్తామని , త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్ లోకనాథ పిళ్లై, మండల సర్వేయర్ సురేష్, ఎంపీడీఓ వనజ, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల బీభత్సం

పులిచెర్ల (కల్లూరు) : మండలంలోని కల్లూరు, పాతపేట, పాళెం, జూపల్లె, పూరేడువారిపల్లె, ఎద్దలవారిపల్లెలోని పొలాల్లో ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. గురువారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు మామిడి కొమ్మలు, కొబ్బరి చెట్లు, వరి పంటను నాశనం చేశాయి. జూపల్లెకు చెందిన నరసింహులు, నాగరాజు, నరేష్ పొలాల్లో మామిడి తోటల్లో కొమ్మలు విరిచేశాయి. అలాగే కల్లూరులో ఇక్బాల్, రాజన్న పొలాల్లో పశుగ్రాసం తొక్కేయగా, మామిడి కొమ్మలు విరిచేశాయి. దాము పొలంలో వరి, కొబ్బరి చెట్లను నాశనం చేశాయి. పంట పొలాలపై ఏనుగులు రాకుండా కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి కాంస్యం

తిరుపతి రూరల్: బ్రెజిల్‌లో సెప్టెంబర్ 16వ తేదీన జరిగిన బ్రిక్స్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంపిటిషన్‌లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎస్.రమాజ్యోతి కాంస్య పతకం సాధించారు. ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీల్లో స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, డిజిటల్ టెక్నాలజీల ఆధారంగా పోటీలు నిర్వహించారు. ''స్మార్ట్, హ్యూమన్, హ్యాపీ అండ్ రెసిలియెంట్ సిటీస్'' అనే ప్రధాన థీమ్‌కు చెందిన ఇన్నోవేషన్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. తిరుపతి నుంచి శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన స్కూల్ ఆఫ్ ఇంజి అండ్ టెక్నాలజీ అధ్యాపకురాలు డా. ఎస్. రమాజ్యోతి తన బయో డిగ్రేడబుల్ ఫుడ్ ప్యాకేజింగ్ ఉత్పత్తులు (బయో ప్యాక్ ఇన్నోవేషన్స్) ను ''కేతనా టెక్‌బీస్'' స్టార్టప్ తరఫున వర్చువల్‌గా ప్రదర్శించారు. అర్బన్ సస్టయిన బిలిటీ–అడ్వాన్స్‌డ్ మ్యానుఫాక్చరింగ్ విభాగంలో ఆమె చేసిన ఆవిష్కరణకు కాంస్య పతకం లభించింది.

మహిళా దొంగలు పట్టివేత

పలమనేరు : పట్టణంలోని బాలాజీ స్వర్ణ మహల్‌లో చాకచక్యంగా బంగారాన్ని దొంగలించే ఇరువురు మహిళా దొంగలను దుకాణ నిర్వాహకులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం పలమనేరులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. మధ్య వయసు కలైన ఇరువురు మహిళలు తమిళ, తెలుగు యాసలో మాట్లాడుతూ.. దుకాణంలోకి వచ్చి బంగారు కమ్మలు కావాలని అడిగి పలు రకాలు చూశారు. ఇంకో మోడల్ అంటూ చూడడం మొదలు పెట్టారు. ఎందుకో వీరిపై అనుమానం కలిగిన దుకాణ యజమాని సీసీ కెమెరాలో వీరిని గమనించడం మొదలు పెట్టారు. ఈ ఇద్దరు దొంగలు ముందుగానే తెచ్చుకున్న డూప్లికేట్ రెండు గ్రాముల కమ్మలను అక్కడ పెట్టి బాక్సులోని ఎనిమిది గ్రాముల బంగారు కమ్మలను తీసుకెళ్లారు. దీంతో ఈ చోరీని గమనించిన దుకాణ నిర్వాహకులు ఆ ఇద్దరు మహిళలను పట్టుకుని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున పోలీసులు అక్కడ జరిగిన చోరీని సీసీ కెమెరాల్లో గమనించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. వీరు తమిళనాడుకు చెందిన చేయి తిరిగిన బంగారు దొంగలుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారించి ఆపై మిగిలిన విషయాలను వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.



సీసీ పుటేజీలో నమోదైన మహిళా దొంగల చిత్రాలు

గోవిందదాసుడిగా ఎన్ని కష్టాలకైనా సిద్ధం



భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : శ్రీరాముడి పట్ల అకుంటితమైన పరమభక్తుడిగా ఆనాడు రామదాసు ఎన్ని కష్టాలు పడ్డాడో.. అదేవిధంగా ఈరోజు గోవిందదాసుడిగా శ్రీవారి ఆలయ పరిరక్షణ, హైందవ ధర్మాన్ని కాపాడడం కోసం తాను ఎన్ని కష్టాలు పడడానికైనా సిద్ధమేనని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టంచేశారు. తిరుపతి పద్మావతీపురంలోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అలిపిరి పాదాల చెంత మలమూత్రాలు, మద్యం బాటిళ్ల మధ్య మహావిష్ణువు విగ్రహాన్ని టీటీడీ పాలకవర్గం, అధికారులు పడవేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విషయాన్ని ఎత్తిచూపితే తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో పాటు ఎదురు దాడులకు సిద్ధపడడం సిగ్గుచేటన్నారు. చేసిన తప్పిదాలను సరిదిద్దుకోకుండా టీటీడీ పాలకవర్గం, టీడీపీ, జనసేన నాయకులు దానికి రాజకీయ రంగు పులమడం వారి నీచతత్వానికి నిదర్శనమన్నారు. మహావిష్ణువు విగ్రహం కాదని, శనేశ్వరస్వామి విగ్రహమని, గత 20 ఏళ్లుగా ఉందని, అసంపూర్తిగా ఉన్న శనేశ్వరస్వామి విగ్రహం గనుక పట్టించుకోలేదంటూ రకరకాలుగా చెబుతున్నారన్నారు. ఆ విగ్రహం ముమ్మాటికీ మహావిష్ణువు విగ్రహం అనడానికి ఎలాంటి సందేహం లేదని స్పష్టంచేశారు. రాయలచెరువు దగ్గర తయారు చేసిన శనేశ్వర స్వామి విగ్రహాన్ని టీటీడీ స్థలంలోకి తీసుకురావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఇలాంటి కేసులకు భయపడేవాడిని కాదని, తనపై ఎన్ని కేసులు పెట్టినా హైందవ ధర్మ పరిరక్షణను, శ్రీవారి ప్రతిష్టను కాపాడుకునేందుకు టీటీడీలో జరిగే తప్పిదాలను ఎత్తిచూపుతూనే ఉంటానన్నారు.

మహిళా పాడి రైతులను ప్రోత్సహించాలి

- పౌల్ట్రీ రంగంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టండి
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మహిళా పాడి రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధుల వృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళల ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ, అనుబంధ ఇతర రంగాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. మహిళలకు తమ ఇంటి వద్ద ఉన్న అవకాశాన్ని బట్టి కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన అవగాహన కల్పించి విత్తనాలు సరఫరా చేయాలన్నారు. సీడీపీవోలు క్షేత్రస్థాయిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి నివేదికలు అందజేయాలన్నారు. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగంలో మహిళలు రాణించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. నగరి, విజయపురం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాల్లో మహిళా రైతులకు ఉద్యానవన పంటలపై ఆసక్తి పెంచేలా కృషి చేయాలన్నారు.

మహిళా రైతులకు అవగాహన కార్యక్రమాలు

జిల్లాలోని మహిళా రైతులకు టిష్యూ కల్చర్ విధానంలో అరటి, బొప్పాయి పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని మహిళా పాడి రైతులను గుర్తించి అవగాహన కార్యక్రమాలు కల్పించాలన్నారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయరంగంలో డ్రోన్ వినియోగం పై విస్తృతంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీఈవో వరలక్ష్మి, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీ అధికారులపై కలెక్టర్ ఫైర్..!

– వీసీని నిలదీసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ సామాజిక వర్గానికి చెందిన వారికే ప్రాధాన్యమిస్తూ వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల పేరిట నూతన ఉద్యోగాలు, తన సామాజిక వర్గానికి చెందిన వారికే ఉద్యోగోన్నతులపై 'ద్రవిడ వర్సిటీలో 'కమ్మ'టి పదోన్నతులు' శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. దీనిపై సీరియస్ అయి గురువారం జిల్లా కలెక్టర్ వర్సిటీ ఫోన్ ద్వారా నూతన ఉద్యోగాలపై వర్సిటీ అధికారులను ఆరా తీసినట్లు తెలిసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఎలా ఉద్యోగాలు ఇస్తారంటూ మండిపడినట్లు తెలిసింది.

కలెక్టర్ దెబ్బకు కొత్త ఉద్యోగాలకు స్వస్తి

ఇంజినీరింగ్ కళాశాల పేరిట కొత్తగా వీసీ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది ఉద్యోగుల భార్యలకు ఉద్యోగాలు కల్పించేందుకు వర్సిటీ అధికారులు పూనుకున్నారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈ నియామకాలకు తాత్కాలికంగా స్వస్తి పలికినట్లు సమాచారం. వాస్తవానికి ఇప్పటికే వర్సిటీలో 200 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వివిధ క్యాడర్లలో పనిచేస్తున్నారు. వీరికి జీతాలు ఇవ్వడానికే నానా తంటాలు పడుతున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా ఉద్యోగాల్లో నియామకాలకు పూనుకోవడం విమర్శలకు తావిచ్చింది. ఇప్పటికే వర్సిటీ మేథమేటిక్స్ విభాగంలో పని చేస్తున్న ఓ కాంట్రాక్టు అధ్యాపకురాలికి అడ్‌హాక్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు కట్టబెట్టారు. అయితే సంబంధిత విభాగంలో ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం గమనార్హం! దీంతో పాటు ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో ఇద్దరు అధికారులను నియమించుకోవడం కూడా విమర్శలకు తావిచ్చింది.



ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

రైతు కుటుంబాలతో ముట్టడిస్తామని వార్నింగ్

ఇష్టానుసారంగా నూతన ఉద్యోగాల కల్పన విషయంగా దుమారం రేగడంతో వర్సిటీకి భూములు ఇచ్చి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు వీసీని నిలదీశారు. తమకు 20 ఏళ్లుగా న్యాయం చేయకుండా, కనీసం జీతాలు సక్రమంగా ఇవ్వకుండా కొత్త ఉద్యోగాలు, ఉద్యోగోన్నతులు ఎలా కల్పిస్తారంటూ ప్రశ్నించారు. తమకు న్యాయం చేయకుండా బయటి వ్యక్తులకు ఉద్యోగాలు కల్పిస్తే సహించేది లేదని, వర్సిటీకి భూములు ఇచ్చిన రైతు కుటుంబాలతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించినట్లు సమాచారం. ఇదలా ఉంచితే, వర్సిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం పేర్కొంటున్నా, ఇక్కడి ఇన్‌చార్జి అధికారులు మాత్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.